RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -4 సంచిక -4 04 శుక్రవారం సెప్టెంబర్ 2026 ఎడిటర్ లక్ష్మి నారాయణ




పేజీలు - 6 వెల రూ 5 /--

## కొండా సురేఖపై కాంగ్రెస్ వేటు..

**మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆదేశం!**

**మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం**
**సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలే ప్రధాన కారణం**
**నేడు సాయంత్రంలోగా రాజీనామా చేయాలని కొండా సురేఖకు డెడ్‌లైన్**
**స్వయంగా తప్పుకోకపోతే బర్తరఫ్ చేయాలని సీఎంకు హైకమాండ్ ఆదేశాలు**
**ఇప్పటికే గవర్నర్‌కు బర్తరఫ్ సిఫార్సు లేఖ పంపినట్లు ప్రచారం**

తెలంగాణ రాజకీయాల్లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె సుస్మిత పటేల్ చేసిన తీవ్ర విమర్శల నేపథ్యంలో, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మంత్రి పదవికి రాజీనామా చేయాలని సురేఖను హైకమాండ్ ఆదేశించింది. ఈ పరిణామంతో ఆమె కేబినెట్ నుంచి వైదొలగడం ఖాయమైపోయింది.



## మోదీని అడిగే దమ్ముందా?..

**- తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్**

**మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన**
**కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్**
**తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ**
**మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన**
**ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్**



## మద్రాస్ హైకోర్టులో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ

**కొలత్తూర్ నియోజకవర్గంలో ఓటమిపాలైన స్టాలిన్**

**ఈవీఎంలు, వీవీపాట్‌లలో అక్రమాలు జరిగాయంటూ పిటిషన్**

**పిటిషన్ విచారణార్హం కాదన్న ధర్మాసనం**

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన సొంత నియోజకవర్గమైన కొలత్తూర్‌లో ఎదురైన ఓటమిని సవాలు చేస్తూ... ఈవీఎంలు, వీవీపాట్ స్లిప్పుల రీ-కౌంటింగ్ నిర్వహించి ప్రత్యర్థి విజయాన్ని రద్దు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, అది విచారణార్హం కాదంటూ కొట్టివేసింది.



## 'ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు'..

**ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా పరోక్ష హెచ్చరిక!**

**భారత్-ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం వార్తలను ఖండించిన అమెరికా**
**ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తామని మార్కో రూబియో హెచ్చరిక**
**ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ అయిన నేపథ్యంలో అమెరికా వ్యాఖ్యలు**
**ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధించడమే తమ లక్ష్యమన్న ట్రంప్ సర్కార్**
**అమెరికాను ఎదుర్కొనేందుకు కొత్త వ్యూహంతో వస్తున్నామన్న ఇరాన్**



**ఎంఐఎం దేశ వ్యతిరేకమనేది దుష్ప్రచారమన్న రేవంత్**
**ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై అసద్, అక్బర్‌తో చర్చించానని వెల్లడి**
**అసద్ సూచించిన అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేయాలని ఆదేశం**



## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు అసద్ తక్కువేమీ కాదు

పాతబస్తీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ
హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించడమే లక్ష్యమని వెల్లడి
ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు అసదుద్దీన్ ఒవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసద్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమంటూ జరుగుతున్న ప్రచారం దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు.

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని సీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. అసదుద్దీన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై తాను అసదుద్దీన్, అక్బరుద్దీన్‌తో చర్చించినట్లు తెలిపారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిందే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాతే పనులు ముందుకు సాగాయని చెప్పారు. ఇన్నేళ్లలో ఎంతమంది ముఖ్యమంత్రులు ఓల్డ్‌సిటీకి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పాతబస్తీ గల్లీల్లోకి తాను తప్ప మరెవరూ రాలేదన్నారు.

**అసద్ చెప్పిన పనులకు వెంటనే అనుమతులు**

ఓల్డ్‌సిటీ అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఏది సూచించినా వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు రేవంత్ చెప్పారు. పాతబస్తీలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు. పెద్దలు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.

**హిందూ, ముస్లింలు కలిసి ఉండాలి**

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వమేనని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు

## భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదు:



ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వానికి సంబంధించిన శంకుస్థాపనలు,

## అక్టోబర్‌లోనే స్థానిక ఎన్నికలు

**రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్**

**స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి**

**ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ**

రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ



పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు.

## నల్సార్ విద్యార్థులకు భారీ ఊరట..

**బీసీఐకి సుప్రీంకోర్టు మొట్టికాయలు**

**న్యాయ విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు**
**నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐని ఆహ్వానించడాన్ని వ్యతిరేకించిన విద్యార్థులు**
**నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థులను ఎన్‌రోల్ చేయవద్దని బీసీఐ ఛైర్మన్ ఆదేశం**
**బీసీఐ అధికారాలు న్యాయవాదులకే వర్తిస్తాయని, విద్యార్థులకు కాదని తీర్పు**



# బాధ్యతల నుంచి వైదొలిగిన ఆసుపత్రి పర్యవేక్షకుడు

## వైద్యులు, సిబ్బంది కొరత.. వరుస వివాదాలతో ఇబ్బందులు

జహీరాబాద్,

జహీరాబాద్ ఏరియా ఆసుపత్రి పర్యవేక్షణ బాధ్యతల నుంచి సూపరింటెండెంట్ డా. కిరణ్‌కుమార్ వైదొలిగారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు తరచూ వెలుగుచూస్తున్న వివాదాస్పద ఘటనలు ఇబ్బందికరంగా మారిన నేపథ్యంలో ఆయన మంగళవారం పర్యవేక్షణ బాధ్యతలను వదులుకుంటూ జిల్లా అధికారులకు లేఖ అందజేసినట్లు సమాచారం.

దీంతో ఆసుపత్రి పర్యవేక్షణ బాధ్యతలను వైద్యుడు డా. మల్లికార్జునస్వామికి అదనంగా అప్పగించారు. ఇకపై ఆసుపత్రి పరిపాలన, వైద్య సేవల పర్యవేక్షణను ఆయన నిర్వహించనున్నారు.

ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న వైద్యులు, సిబ్బంది కొరతను పరిష్కరించడంతో పాటు, ఆసుపత్రి నిర్వహణపై వస్తున్న ఆరోపణలు, వివాదాలకు చెక్ పెట్టేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు, రోగుల బంధువులు కోరుతున్నారు.

## ఘనంగా ప్రారంభమైన వాసవి కన్యకా పరమేశ్వరి శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు

సంగారెడ్డి:

సంగారెడ్డి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి వైదిక పర్యవేక్షణలో వేద మంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలిరోజు కార్యక్రమాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యావాచనం, దీక్షాధారణ, మండప ప్రవేశం, మాతృకా యోగిని పూజ, నవ చండీయాగం తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ కోశాధికారి జూలకంటి మల్లేశం, ఉపాధ్యక్షులు మ్యాడం రాధా కిషన్, కార్యనిర్వాహక కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, ఆలయ కమిటీ సభ్యులు నామ భాస్కర్, జూలకంటి బుచ్చిలింగం, ఆమేటి కిట్టు, పుల్లూరి ప్రకాష్, ఆమెటి భాస్కర్, గుండ్లపల్లి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?

**-కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సమరశంఖం**
**-సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా.. 'కాంగ్రెస్ బాకీ కార్డుల' పంపిణీ**
**-హామీలు అమలు చేసే వరకు ప్రజల తరపున పోరాటం: చింత ప్రభాకర్**

సంగారెడ్డి:

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహ ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన 420 హామీలతో కూడిన భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ.. హామీలను ఒక్కొక్కటిగా ప్రజలకు గుర్తు చేశారు.ధర్నా అనంతరం బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేశారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రజలు, ఆటో ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులకు కార్డులను అందజేస్తూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు.హామీలు ఇచ్చారు.. ఓట్లు అడిగారు.. అధికారంలోకి వచ్చారు.. కానీ హామీలు మాత్రం అమలు చేయలేదు" అంటూ ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, హకీమ్, డాక్టర్ శ్రీహరి, సునీల్, మనోహర్ గౌడ్, కొండల్ రెడ్డి, చింత సాయినాథ్, మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, చక్రపాణి, విఠల్, ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, చింత గోపాల్, శ్రవణ్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్సార్ విద్యార్థులకు భారీ ఊరట..

న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది.నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్-ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు.ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం, విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నల్సార్ విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది.

# భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదు:

ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సీఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీ ఉత్పత్తులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రంలో తీవ్రరూపం దాలుస్తున్న ఎల్‌నినో పరిణామాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత స్వల్ప వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర తీవ్ర వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదని, భూగర్భ జలాల ఆధారంగా అవసరమైతే అదనపు బోర్లు వేసేందుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని అన్నారు.

# మద్రాస్ హైకోర్టులో స్టాలిన్‌కు ఎదురుదెబ్బ

వివరాల్లోకి వెళితే... కొలత్తూర్ శాసనసభ నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి వి.ఎస్. బాబు చేతిలో 8,795 ఓట్ల తేడాతో స్టాలిన్ పరాజయం పాలయ్యారు. అయితే ఈవీఎంలు, వీవీపాట్‌లలో అక్రమాలు జరిగాయని, కొన్ని యంత్రాలు అభ్యర్థి పేరును కూడా గుర్తించడంలో విఫలమయ్యాయని ఆరోపిస్తూ స్టాలిన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. 100 శాతం వివిపాట్ స్లిప్పులను లెక్కించి, తనను విజేతగా ప్రకటించాలని కోర్టును కోరారుఅయితే కేంద్ర ఎన్నికల సంఘం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాదులు.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329(ఎ), ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఎన్నికల ఫలితాలను కేవలం 'ఎలక్షన్ పిటిషన్' ద్వారా మాత్రమే సవాలు చేయాల్సి ఉంటుందని, సాధారణ రిట్ పిటిషన్ ద్వారా కాదని స్పష్టం చేశారు. ఈ వాదనలతో ఏకీభవించిన మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ. ధర్మాధికారి, జస్టిస్ జి. అరుళ్ మురుగన్‌లతో కూడిన ధర్మాసనం స్టాలిన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తుది తీర్పు వెలువరించింది.

# కొండా సురేఖపై కాంగ్రెస్ వేటు..

గత కొంతకాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ చేస్తున్న వ్యాఖ్యలు, ఆరోపణలు పార్టీలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ విచారణ జరిపి, అధిష్ఠానానికి ఒక నివేదిక సమర్పించింది. ఈ నివేదికను, రాష్ట్ర పార్టీ నేతల అభిప్రాయాలను తీవ్రంగా పరిగణించిన కాంగ్రెస్ పెద్దలు, కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించాలని నిర్ణయించారు.ఇందులో భాగంగా నేడు సాయంత్రంలోగా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని కొండా సురేఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఆమె స్వయంగా తప్పుకోని పక్షంలో, తక్షణమే బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌కు సంబంధించిన సిఫార్సు లేఖ గవర్నర్‌కు చేరినట్లు కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.వాస్తవానికి, ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లి వచ్చిన కొండా సురేఖ దంపతులు, అక్కడి పరిణామాలపై గురువారం మీడియా సమావేశంలో వివరణ ఇవ్వాలని భావించారు. అయితే, వారు స్పందించేలోపే అధిష్టానం ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. కొండా సురేఖ అనుచరులు, కార్యకర్తలు ఈ వార్తతో షాక్‌కు గురయ్యారు. మొత్తానికి, కొండా సురేఖ రాజీనామా చేస్తారా లేక బర్తరఫ్‌కు గురవుతారా అనే దానిపై సాయంత్రానికి స్పష్టత రానుంది.

## అక్టోబర్‌లోనే స్థానిక ఎన్నికలు

మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

# మోదీని అడిగే దమ్ముందా?..

తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు.

తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# 'ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు'..

ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

"భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు.

**ఆంక్షల విషయంలో వెనక్కి తగ్గేది లేదు**

అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు.

**ఇరాన్‌కు అణ్వస్త్రం దక్కనివ్వం**

ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు.

గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ధర్నా

హైదరాబాద్ ఎస్టేట్ సెప్టెంబర్ 3మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం:
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా, ప్రభుత్వ పాలనపై నిరసన వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కౌడిపల్లి మండల కేంద్రంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ ధర్నా కార్యక్రమం మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హరీష్ రావు గారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రభుత్వ పాలనలో ఎదురవుతున్న సమస్యలు, ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలను ప్రస్తావిస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుజరంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడానికి కౌడిపల్లి మండల కేంద్రానికి తరలివెళ్లడం జరుగుతుంది. బుజరంపేట్ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల శ్రీనివాస్ గారు మరియు ఉప సర్పంచ్ కౌడిపల్లి గోపాల్ గారి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొనున్నారు. గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా తరలివెళ్లి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, ప్రజల తరఫున బలమైన గొంతుకగా నిలవడం లక్ష్యంగా ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
కౌడిపల్లి మండల కేంద్రంలో జరిగే ఈ ధర్నా



కార్యక్రమంలో బుజరంపేట్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్ పట్లోళ్ల శ్రీనివాస్ ఉప సర్పంచ్ కౌడిపల్లి గోపాల్, వార్డ్ మెంబర్స్ అమృత లక్ష్మయ్య, ఆంజనేయులు, శ్రీను, సురేష్, పెంటయ్య, రాములు, వైష్ణవి అశోక్, పార్టీ నాయకులు నాయికోటి లింగం, కర్నె జగన్మోహన్ రెడ్డి సంద్రు యాదగిరి, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయనున్నారు

# గంగారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్ దేవేందర్ నాయక్

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 03:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం జరిగింది గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ... మహేశ్వరం మండల కేంద్రంలోనే గంగారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గంగారం సర్పంచ్ తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఉప సర్పంచ్ మహేందర్ విలేజ్ సెక్రటరీ మహేష్ వార్డ్ మెంబర్స్ ముణాత్ రవి నాయక్ మోహన్ జ్యోతి గోపి రజిత శ్రీనివాస్ లావణ్య శ్రీనివాస్ పద్మ దేవా ధర్మ గ్రామ పెద్దలు పాల్గొన్నారు



# ప్రజా పాలనకు నిదర్శనం కాంగ్రెస్ పార్టీ

హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల( ప్రతినిధి)
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల ప్రజాపాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుఆదేశాల మేరకు మద్దిరాల మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిరాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పచ్చిపాల వెంకన్న యాదవ్ కేక్ కట్ చేసినాయకులు,కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రైతులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి సంక్షేమ పథకాలతో ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని నాయకులు తెలిపారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మందుల సామేలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వివిధ గ్రామ గ్రామ సర్పంచులు గ్రామ శాఖ అధ్యక్షులు మాజీ ఎంపీటీసీలు వార్డ్ మెంబర్లు జిల్లా నాయకులు



మండల నాయకులు యూత్ నాయకులు నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, సేవాదళ్ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అక్రమ కబ్జాకు యత్నించిన సర్పంచ్ భర్త, కొడుకుపై కేసు నమోదు: -జోగిపేట ఎస్ఐ గిరి శ్రీకాంత్

ఉమ్మడి మెదక్ జిల్లా,సెప్టెంబర్ 03(హైద్రాబాద్ ఎస్టేట్):
తనకు చెందిన 3.5 గుంటల భూమిలో అక్రమంగా చొరబడి షెడ్డు వేసిన సర్పంచ్ భర్త,కొడుకుపై బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు జోగిపేట ఎసై గిరి శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా అందొల్ మండలం కన్సన్ పల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి భూమిలో అదే గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త మహిపాల్ ఆయన కొడుకు ప్రవీణ్ ( మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు)అక్రమంగా చొరబడి షెడ్డు వేయడం జరిగిందన్నారు. ఈ విషయంపై బాధితుడు వారిని సంప్రదించగా ఆ స్థలం మాదేనని అందుకే షెడ్డు వేసామని బెదిరించాడన్నారు. దీంతో బాధితుడు ప్రభాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు మహిపాల్,ఆయన కొడుకు ప్రవీణ్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.




# గత ప్రభుత్వం ఆర్థిక అరాచకం చేసింది - మంత్రి పొంగులేటి

,తెలంగాణ, సెప్టెంబర్ 3.
గత ప్రభుత్వం ఆర్థిక అరాచకానికి పాల్పడిందన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. తెలంగాణ ప్రజల సొమ్మును బీఆర్ఎస్ దోచుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ తప్పిదాలను సరిదిద్దుతూ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వచ్చే ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు.




# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

**-అవంతి కళాశాలలో యాంటీ-ర్యాగింగ్ అవగాహన సదస్సు -చట్టాలపై విద్యార్థులకు పోలీసుల దిశానిర్దేశం**

హైదరాబాద్, సెప్టెంబర్ 03:
విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ పరస్పర గౌరవంతో మెలగాలని, క్యాంపస్‌లలో ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు నాశనమవడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. బర్కత్‌పురాలోని అవంతి డిగ్రీ ఄ పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'యాంటీ-ర్యాగింగ్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా సబ్-ఇన్‌స్పెక్టర్లు కె. పవన్, సత్తయ్య మాట్లాడుతూ.. ర్యాగింగ్ నిరోధక చట్టాలు, వాటిని ఉల్లంఘిస్తే ఎదురయ్యే పర్యవసానాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా సోదరభావంతో ఉండాలని, కళాశాలలో ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు.
కళాశాల ప్రిన్సిపాల్, వైస్-ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రతకు కళాశాల యాజమాన్యం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతి ఒక్కరూ ఉన్నత విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ఎస్సైలు పవన్, సత్తయ్య, లేడీ కానిస్టేబుల్ పావనిలను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




# నడిచే విజ్ఞాన సర్వస్వం సారామపెల్లి మల్లారెడ్డి

## జాతీయ రైతు నేత మల్లారెడ్డి సంతాప సభలో ఎమ్మెల్యేలు, జాతీయ నాయకులు

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్
పీడిత ప్రజల విముక్తి కోసం నిత్య పరిశోధకుడు, పరిశీలకుడు, నడిచే విజ్ఞాన సర్వస్వం సారంపెల్లి మల్లారెడ్డి అని ఎమ్మెల్యేలు, పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు కొనియాడారు. హనుమకొండ జిల్లా కేంద్రం పొద్దుటూరు గార్డెన్ లో సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన జాతీయ రైతు సంఘం నాయకులు, సిపిఎం నాయకులు సారంపెల్లి మల్లారెడ్డి సంతాప సభలో సిపిఎం పార్టీ పొలిటి బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మేయర్ డాక్టర్ టి రాజేశ్వర్ రావు, సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎస్. వీరయ్య రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. నాగయ్య, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి గాదెగోయిన రవి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్, సిపిఎం రాష్ట్ర నాయకులు జి. రాములు కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు స్కైలాబ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

రైతాంగ సమస్యలపై, భూ సమస్యలను, జల సమస్యలను, విద్యుత్తు సమస్యలపై నిరంతర అధ్యయనం చేసి ప్రజలను చైతన్యం చేయడంలో జీవితాంతం పోరాటం చేసిన మల్లారెడ్డి వయసులో పెద్దవారు అయినా ఆలోచనలో యువకుడని, చీకటి బతుకుల్లో వెలుగులు నింపే దివిటీగా పని చేశారని అన్నారు. భూమి సమస్యపై, రైతాంగ సమస్యల మీద నిరంతరం పోరాటాలు చేసేది కమ్యూనిస్టులేనని, అలాంటి వారిలో ముందున్న వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని అన్నారు. 1956లో సుందరయ్య అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం కోసం తిరిగారని, ప్రాజెక్టు, కాలువలు కమ్యూనిస్టులు పోరాటం వల్ల వచ్చాయని అన్నారు. మల్లారెడ్డి గ్రామంలో సర్పంచ్ గా గెలిచి అన్ని సౌకర్యాలు కల్పించారని, కమ్యూనిస్టులు లేని ప్రాంతాలు వెనకబడి ఉన్నాయని, దక్షిణ రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి అంటే కమ్యూనిస్టుల వలనేనని అన్నారు. మల్లారెడ్డి చివరి వరకు పార్టీ కోసం పని చేశారని, ప్రజల్లో ఉంటే ఆరోగ్యంగా ఉంటామని మల్లారెడ్డి ఎప్పుడూ చెబుతుండేవారని, ఆయన పోలీస్ పటేల్ గా ఉండి ప్రజలకు సేవ చేయడం సాధ్యంకాదని కమ్యూనిస్టుగా మారాడని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటమే మల్లారెడ్డి జరిగి అర్పించే నిజమైన నివాళి అన్నారు. కేసులు, హత్యలు, నిర్బంధాలను తట్టుకొని నిలబడ్డారని, కుటుంబాన్ని పార్టీలో భాగం చేశారని, నిరంతరం అధ్యయనం చేసి సమాచారాన్ని ప్రజా సంఘాలకు అందించే వారని అన్నారు. శాసన సభలో ఏం మాట్లాడాలని అంశంపై సలహాలు, సూచనలు ఇచ్చేవారని, సాధారణ జీవితం గడిపారని, అందరితో స్నేహంగా వ్యవహరించే వారని అన్నారు. రాజ్యాంగాన్ని దిక్కరించేలా పాలక వర్గాలు వ్యవహరిస్తున్నాయని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గం అని, అదే మార్గాన్ని మల్లారెడ్డి అనుసరించారని అన్నారు. ఆయ ఆయన చనిపోయేంతవరకు ప్రజల మనిషిగా జీవించారని అన్నారు. వరంగల్ జిల్లాలో సాగునీరు సాగునీరు కోసం రైతాంగ సమస్యల కోసం నిరంతరం ఉద్యమాలు నడిపిన వ్యక్తిని జిల్లాలో ఇండ్లు లేని పేదలను సమీకరించి వేలాదిమంది పేదలకి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేయించి ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సారంపల్లి మల్లారెడ్డి స్ఫూర్తి అందరికీ ఆదర్శమని ఆయన బాటలో కొనసాగించాలని వారు అన్నారు.

అధ్యయనం, ఆచరణ, ఆందోళన, పోరాటం కలగలిపిన విప్లవకారుడు మల్లారెడ్డి అని అన్నారు. పేదలకు భూములుండాలని, పేదల భూములు లాక్కోవడానికి చేసే ఏ చర్యనైనా వ్యతిరేకించాలని మల్లారెడ్డి అనే వారని, ఆయన నిత్య విద్యార్థిగా అధ్యయనం చేయడంతో పాటు నిత్యం బోధించి ఉద్యమకారులకు ఎంతో జ్ఞానాన్ని అందించారని అన్నారు. తన జీవితాన్ని, కుటుంబాన్ని త్యాగం చేసిన మల్లారెడ్డి సేవలు చాలా గొప్పవని అన్నారు. సాగునీటి వనరుల అభివృద్ధి, ఉపయోగం గూర్చి శాస్త్రీయంగా చర్చించి వాటి అమలు కోసం నిరంతరం పనిచేసేవారని, ప్రజా పోరాటాల ద్వారానే పీడిత ప్రజలకు విముక్తి జరుగుతుందని నిత్యం బోధించే వాడని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మల్లారెడ్డి మరణం తర్వాత వస్తున్న చర్చపై అన్ని కమ్యూనిస్టు పార్టీలు దృష్టి సారించాలని అన్నారు. దేశానికి వెన్నుముక లాంటి రైతాంగ సమస్యలపై మల్లారెడ్డి పోరాటాలను కమ్యూనిస్టు పార్టీలు దృష్టి సారించాలని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలు ముక్కలు కావడం చాలా బాధాకరమని మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కమ్యూనిస్టులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి. సాగర్, గోపు జయపాల్ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు రవీందర్ రెడ్డి, సూడి కృష్ణా రెడ్డి, ఎన్. అశోక్ స్టాలిన్, డాక్టర్ విజయలక్ష్మి, చంద్రా రెడ్డి,



సిహెచ్ రంగయ్య, వాసుదేవ రెడ్డి, రాగుల రమేష్, చుక్కయ్య, బొట్ల చక్రపాణి, టి ఉప్పలయ్య, గొడుగు వెంకట్, తిరుపతి, ఉడుత రవీందర్, సోమిడి శ్రీనివాస్, శోభన్, సాంబరాజు, బంధు సాయిలు, ఆముదాల మల్లారెడ్డి, జానా రెడ్డి, న్యాయవాదులు శ్రీనివాస రావు, మధుసూదన్ రెడ్డి, వేణుగోపాల్, సాయిని నరేందర్ లతోపాటు వందలాది మంది కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు



# నషా ముక్త్ యువ -- వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నషా ముక్త్ యువ పల్నాడు జిల్లా స్థాయి పోటీలు ఘనంగా నిర్వహణ

## -మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి యువత విద్యా నైపుణ్యాలు పెంచుకోవాలి

## -మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర

పెదకూరపాడు, సెప్టెంబర్ 3 **హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి పల్నాడు**

మేరా యువ భారత్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో "నషా ముక్త్ యువ -- వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా గురువారం పెదకూరపాడు కాకతీయ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలో, జన చైతన్య సమితి ఎన్జీవో సహకారంతో నషా ముక్త్ యువ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. సంగీతం, నృత్యం, రీల్/షార్ట్ ఫిల్మ్, నుక్కడ్ నాటక్, కవిత్వం, డిబేట్, స్లోగన్, పెయింటింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యకరమైన జీవన విధానం, యువతలో సానుకూల ఆలోచనలు, డ్రగ్-ఫ్రీ ఇండియా వంటి అంశాలపై విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెదకూరపాడు తహసీల్దార్ కే. శ్రీనివాసరావు హాజరై యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజం మరియు దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం




చూపుతుందని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి మరియు దేశ సేవపై దృష్టి సారించాలని సూచించారుమేరా యువ భారత్, గుంటూరు జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ, నషా ముక్త్ యువ కార్యక్రమాల ద్వారా యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడంతో పాటు, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. యువత తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుని దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ విభాగం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు, యువతక మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన




మరియు బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అవలంబించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాకతీయ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎస్. సాంబశివరావు, పెదకూరపాడు నియోజకవర్గం సీపీఐ పార్టీ ఇన్‌చార్జి మునుగోలు శ్రీనివాసరావు. ఈ కార్యక్రమాన్ని జన చైతన్య సమితి ఎన్జీవో సహకారంతో నిర్వహించగా, జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, కార్యదర్శి తుళ్లూరు సాంబశివరావు, కోఆర్డినేటర్ వెలితోటీ అనిల్ కుమార్, సభ్యులు లియాఖత్ అలీ తదితరులు పాల్గొన్నారు. అతిథులు వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు

# చిట్యాలలో గుడుంబా విక్రయిస్తున్న మహిళ పట్టివేత:

### -5 లీటర్ల గుడుంబా స్వాధీనం

### -ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవు

### : ఎస్సై పోచంపల్లి సతీష్ హెచ్చరిక

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

చిట్యాల గ్రామ పరిధిలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఒక మహిళను పట్టుకొని, ఆమె వద్ద నుండి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు చిట్యాల సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్సై) పోచంపల్లి సతీష్ గారు తెలిపారు.

వివరాలు:



గురువారం మధ్యాహ్నం సుమారు 15:10 గంటల సమయంలో చిట్యాల హెడ్ కానిస్టేబుల్ వి. చంద్రమౌళి తమ సిబ్బందితో కలిసి చిట్యాల గ్రామ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఒక మహిళ ప్లాస్టిక్ క్యాన్‌తో ఉండి ఆ క్యాన్‌లో 5 లీటర్ల నిషేధిత నాటుసారా (గుడుంబా) లభ్యమైంది.

విచారణలో సదరు మహిళ పాశిగడ్డ తండ గ్రామానికి చెందిన జార్పుల ఉష (36), భర్త: రాజు అని తెలిసింది. ఆమె వద్ద ఉన్న సుమారు రూ. 2,000/- విలువ గల 5 లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్సై పోచంపల్లి సతీష్ గారు మాట్లాడుతూ, మండల పరిధిలోని గ్రామాలలో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, అక్రమంగా నిల్వ ఉంచినా లేక విక్రయించినా వారిపై చట్టపరంగా అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని వెంటనే పోలీస్ స్టేషన్‌కు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మళ్లీ మాస్ జోరు.. 'ఇరుముడి'తో రవితేజ రికార్డు వసూళ్లు!

## చాలా రోజుల తర్వాత భారీ విజయం.. బాక్సాఫీస్ బరిలో దూసుకెళ్తున్న మాస్ మహారాజా

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్ మాస్ మహారాజా రవితేజకు 'ఇరుముడి' మంచి విజయాన్ని అందించింది. కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న రవితేజకు ఈ సినిమా భారీ ఊరటనివ్వడంతో పాటు, బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది.

ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఇరుముడి' విడుదలైనప్పటి నుంచి వసూళ్లలో జోరు కొనసాగిస్తోంది. యాక్షన్‌తో పాటు భావోద్వేగ అంశాలను మేళవించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా రవితేజ తనదైన మాస్ ఎనర్జీతో మరోసారి అభిమానులను అలరించారు.

తాజా బాక్సాఫీస్ లెక్కల ప్రకారం.. సినిమా 13 రోజుల్లో భారత్‌లో రూ.146.15 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. ఇక ప్రపంచవ్యాప్తంగా రూ.191.60 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టినట్లు ట్రేడ్ వర్గాల నివేదికలు వెల్లడిస్తున్నాయి.

దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో చెప్పుకోదగ్గ విజయంగా నిలుస్తోంది. చాలా రోజుల తర్వాత వచ్చిన ఈ భారీ సక్సెస్‌తో రవితేజ అభిమానుల్లో సందడి నెలకొంది. వరుస విజయాల కోసం ఎదురుచూస్తున్న మాస్ మహారాజాకు 'ఇరుముడి'




కొత్త ఊపునిచ్చిందనే చెప్పాలి.

హిట్ కోసం ఎదురుచూస్తున్న రవితేజకు 'ఇరుముడి' విజయంతో మళ్లీ బాక్సాఫీస్‌పై మాస్ మహారాజా తన మార్క్‌ను చూపించాడు.

# ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 3:-

రంగారెడ్డి జిల్లా: ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

పోలీసుల వివరాల ప్రకారం..

గురువారం తెల్లవారుజామున సుమారు 2.45 గంటల సమయంలో షాద్‌నగర్ వైపు నుంచి బొంగ్లూరు దిశగా వెళ్తున్న ఇనుప రాడ్ల లోడుతో ఉన్న భారీ వాహనం ముందుకు వెళు తుండగా, దాని వెనుక కూరగాయల లోడుతో వస్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి భారీ వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదం రావిరాల గ్రామ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు 13వ వద్ద, తుక్కుగూడ నుంచి బొంగ్లూరు వైపు వెళ్లే మార్గంలోని మూడో వరుసలో జరిగింది.

ప్రమాద తీవ్రతకు బొలెరో వాహనం డ్రైవర్ కొటకొండ శివ (22)కు భారీ వాహనంలో ఉన్న ఇనుప రాడ్లు శరీరంలోకి దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నంద్యాల జిల్లా డోన్ మండలం ఫీవర్‌బండ గ్రామానికి చెందిన వెంకటరాములు కుమారుడిగా పోలీసులు గుర్తించారు. బొలెరోలో ప్రయాణిస్తున్న నాగేశ్వరరావుకు కాలికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)



మండల కేంద్రం లో తెలంగాణ భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు తుంగతుర్తి నియోజకవర్గం ఇన్చార్జి కడియం రామచంద్రయ్య ఆదేశానుసారం మండలంలో బిజెపి పార్టీ నిరసన వ్యక్తం చేయడం జరిగిందిఅని బిజెపి మండల అధ్యక్షుడు వల్లపు అశోక్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వంగూరి రమేష్ పాల్గొని మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజల కొండ దండగ ఉంటానని చెప్పి మోసపూరితమైన మాటలతో కాలాన్ని గడుపుతూ ప్రభుత్వ పరిపాల చేస్తుంది పేదల నడ్డి విరుస్తుంది బిజెపి కార్యకర్తలు ప్రజల పండగ పోరాడుతుంటే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పోలీసులతో బిజెపి కార్యకర్తలపై దండయాత్ర చేస్తుంది అట్లాగే రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్మెంట్స్ ఇవ్వకుండా విద్యార్థులపై కక్షపూరితమైన నిరుద్యోగులకు ఉద్యోగాలు వేయకుండా ఇబ్బంది పెడుతుంది ఏదైతే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ అమలులో ఫెయిల్ అయినది వీటికి మండలంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసినాము ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు జంపాల ఉపేందర్ బిజెపి సీనియర్ నాయకులు నితిన్ రెడ్డి గారు భూతం లింగ పవన్ యాదవ్ కందుకూరి మహేష్ పాక మధు గుండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు

# ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఆధ్వర్యంలో పెట్టుబడి అవగాహన కార్యక్రమం

హైదరాబాద్ ఎ స్టేట్ మద్దిరాల (ప్రతినిధి )

మద్దిరాల గ్రామంలోని పోస్టాఫీసు ఆధ్వర్యంలో, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మరియు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (ఐ ఈ పి పి ) సంయుక్త సహకారంతో "నివేశక్ దీదీ" శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ శిబిరం ముఖ్య ఉద్దేశ్యం గ్రామస్తులకు వివిధ పెట్టుబడి పథకాలపై అవగాహన కల్పించడం మరియు పాంజీ స్కీములు, నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించడం.




మోసపూరిత పథకాల ఎర ల్లో పడకుండా ప్రజలను చైతన్యవంతం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం.కార్యక్రమంలో భాగంగా తపాలా శాఖ అందించే వివిధ పొదుపు, పెట్టుబడి పథకాల గురించి వివరించారు. అదేవిధంగా ఐ పి పి బి అందించే సేవింగ్స్ ఖాతాలు, బీమా పథకాల గురించి కూడా వివరణాత్మకంగా తెలియజేశారు. ముఖ్యంగా, కేవలం రూ.750 వార్షిక ప్రీమియంతో రూ.15 లక్షల యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కవరేజ్ లభించే పథకంపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామస్తులకు వివరించారు. ఈ శిబిరంలో మేనేజర్ రాజేష్ రెడ్డి సుధీర్ బిపిఎంలు ఉదయ శ్రీ గౌతమ్, షబ్బీర్, రవి సంతోష్, మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పెట్టుబడి భద్రత మరియు బీమా పథకాలపై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు.. హామీల జాడేది?

## -"కందుకూరులో రైతులతో కలిసి బి ఆర్ ఎస్ నాయకుల నిరసన"

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 3:-

కందుకూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. కందుకూరు మండల కేంద్రంలో రైతులతో కలిసి నిరసన చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికలకు ముందు చేతిలో పెట్టిన 100 రోజుల గ్యారంటీ కార్డు.. ఇప్పుడు వెయ్యి రోజులైనా ఎందుకు అమలు కాలేదని బీఆర్ఎస్ నాయకులు నిలదీశారు. గ్యారంటీ కార్డులను ప్రజలకు చూపిస్తూ.. కాంగ్రెస్ హామీలను గుర్తుచేశారు. రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సాయం, పంటలకు గిట్టుబాటు ధర, యువతకు ఉపాధి, మహిళలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందని, సాగు ఖర్చులు పెరిగినా రైతుకు అండగా నిలిచే విధానాలు కనిపించడం లేదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, రహదారులు, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లోనూ ఆశించిన స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదన్నారు. "వంద రోజుల్లో మార్పు తీసుకొస్తామని చెప్పి.. వెయ్యి రోజులు గడిచినా ప్రజల జీవితాల్లో మార్పు ఎక్కడ?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ నాయకులు చురకలు అంటించారు.

ప్రజలను మభ్యపెట్టే హామీలు కాకుండా.. ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, పేదలు, మహిళలు, యువత సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సామ మహేందర్ తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.




# ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో మేలు

## - అనంతారంలో రైతులకు క్షేత్రస్థాయి శిక్షణ

గీసుగొండ, సెప్టెంబర్ 3 హైదరాబాద్:

రైతులకు తక్కువ పెట్టుబడితో సుస్థిర సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఆత్మ) ఆధ్వర్యంలో అనంతారం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు. రైతుల పూర్వ అనుభవ గుర్తింపు (ఆర్‌పీఎల్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ శిక్షణలో ప్రకృతి వ్యవసాయ విధానాలను క్షేత్రస్థాయిలో వివరించినట్లు మండల వ్యవసాయ అధికారి పి. హరి ప్రసాద్ బాబు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై రైతుల నైపుణ్యాలను పెంపొందించడం, పర్యావరణహిత సాగును ప్రోత్సహించడం, సాగు వ్యయాన్ని తగ్గించడం, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తితోపాటు స్థిరమైన ఆదాయానికి దోహదపడే సాగు పద్ధతులను రైతులకు పరిచయం చేయడమే శిక్షణ ఉద్దేశమన్నారు. అనంతారంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు శ్రీకాంత్ పొలంలో క్షేత్రస్థాయి శిక్షణ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వివిధ కషాయాల తయారీ, జీవామృతం తయారీ, వినియోగ విధానాలను రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాటికాయల సతీష్, క్లస్టర్ ఏఈఓ పి. అఖిల, సముదాయ వనరుల వ్యక్తులు (సీఆర్‌పీలు), గ్రామ రైతులు పాల్గొన్నారు.



# అక్షరమే ఆయుధంగా..
# పాటే పయనంగా!





**- జూకల్ నుంచి జాతీయ స్థాయి గుర్తింపు వైపు యువకవి మ్యాదరి సునీల్ - జానపదం నుంచి సినీగీతాల వరకు .. తెలంగాణ సంస్కృతిని అక్షరాల్లో ఆవిష్కరిస్తూ.. సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిగా నిలుస్తున్న రచయిత**

చిట్యాల:
పల్లె మట్టిలో పుట్టిన అక్షరం.. సమాజాన్ని పలకరిస్తే అది సాహిత్యం. ఆ సాహిత్యాన్ని ప్రజల గొంతుకగా మలిస్తే అది చైతన్యం. అలాంటి చైతన్య స్ఫూర్తితో తన కలాన్ని పరుగులు పెట్టిస్తున్న యువకవి, పాటల రచయిత మ్యాదరి సునీల్. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన సునీల్.. కవిత్వం నుంచి జానపద గీతాల వరకు, బతుకమ్మ పాటల నుంచి సినీగీతాల వరకు తనదైన శైలితో ముందుకు సాగుతున్నారు.

**చిన్ననాటి నుంచే సాహిత్యంపై మక్కువ**

మ్యాదరి రాజమౌళి, భారతి దంపతుల కుమారుడైన సునీల్ 1987 జూన్‌లో జూకల్‌లో జన్మించారు. జూకల్‌లో ప్రాథమిక విద్యను అభ్యసించిన ఆయన.. పరకాలలో తొమ్మిదో తరగతి చదివి, తిరిగి జూకల్‌లో పదో తరగతి పూర్తి చేశారు. చిట్యాలలో



ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించారు.
ఎనిమిదో తరగతి చదువుతున్న సమయంలో స్నేహితులు పాటలు పాడుతుంటే కంజర వాయించే సునీల్‌కు పాటలు రాయాలనే



ఆసక్తి కలిగింది. ప్రముఖ సినీ గేయరచయిత చంద్రబోస్ స్వగ్రామం చల్లగరిగె తన ప్రాంతానికి సమీపంలో ఉండటం, చంద్రబోస్‌తో పాటు వేటూరి సాహిత్యం తనను ప్రభావితం చేయడంతో కవితలు, పాటలు రాయడం ప్రారంభించారు.

**500 కు పైగా పాటలు.. ఎన్నో భావాలు**

సునీల్ ఇప్పటివరకు 500 కు పైగా పాటలు రాశారు. జానపదం, ఫోక్, పల్లె జీవితం, బతుకమ్మ, బోనాలు, భక్తి, సామాజిక చైతన్యం, విద్య, యువత వంటి విభిన్న అంశాలు ఆయన రచనల్లో ప్రతిబింబిస్తాయి.
'ఓరుగల్లు కళా వైభవం వెన్నెలలా ప్రకాశిస్తుంది', 'పల్లెలు పట్టు కొమ్మలు', 'పచ్చని బ్రతుకులకు జలమే మన ఆయువు', 'ఓటంటే తెలుసుకో.. ఓటు విలువ తెలుసుకో' వంటి కవితలు ఆయన రచనా వైవిధ్యానికి అద్దం పడుతున్నాయి.

**తెలంగాణ సంస్కృతికి పాటల రూపం**

బతుకమ్మ, పల్లె సంస్కృతి, తెలంగాణ జీవన విధానాన్ని ప్రతిబింబించే పాటలకు సునీల్ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. 'పుడమి పూల జాతర', 'ఒక్కేసి పువ్వేసి..', 'రంగు రంగు పువ్వులు..', 'తీరొక్క పూలల్లో బతుకమ్మ..' వంటి పాటల ద్వారా తెలంగాణ పండుగల వైభవాన్ని తన అక్షరాల్లో ఆవిష్కరిస్తున్నారు.

ఇటీవల 'సలాం హైదరాబాద్' చిత్రంలో సునీల్ రచించిన బతుకమ్మ పాటకు చోటు దక్కడం ఆయన సినీ ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది

**. సినీగీతాల్లోనూ తనదైన ముద్ర**

ప్రేమ, పల్లె జీవనం, యువత, తెలంగాణ నేపథ్యం వంటి అంశాలపై ఆయన రాసిన పలు సినీగీతాలు, ఫోక్ పాటలు ప్రజాదరణ పొందుతున్నాయి. సినీనటి సౌందర్య, గాయని మధుప్రియ వంటి ప్రముఖులపై సునీల్ రచించిన పాటలు కూడా అభిమానులను ఆకట్టుకున్నాయి.

**పురస్కారాలతో గుర్తింపు**

సాహిత్య, కళా రంగాల్లో సునీల్ చేసిన కృషికి పలు పురస్కారాలు లభించాయి. అంబేద్కర్ జాతీయ అవార్డు, జిల్లా ఉత్తమ సాహితీ అవార్డు, కళారత్న, నంది, స్ఫూర్తి, సంక్రాంతి జాతీయ పురస్కారం, లెజెండ్ అవార్డు, గ్లోబల్ ఐకాన్ అవార్డు, సూపర్ స్టార్ అచీవర్స్ అవార్డు తదితర పురస్కారాలను అందుకున్నారు.
తెలంగాణ దశాబ్ది వేడుకల్లో ఉత్తమ సాహితీవేత్తగా సత్కారం పొందారు. ప్రముఖ సినీ గేయరచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ సునీల్ రచనలను ప్రశంసించి సన్మానించడం ఆయన సాహితీ ప్రస్థానంలో ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

**సాహిత్యంతో పాటు సేవా బాట**

కలం పట్టిన చేతే సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటోంది. జూకల్ గ్రామంలో చేయూత ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వరద బాధితులకు నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేయడం, అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు బియ్యం అందించడం, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఆర్థిక సహాయం చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.
వృద్ధులకు అన్నదానం, నూతన వస్త్రాల పంపిణీ, ఉపాధ్యాయుల సన్మానం, విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందించడం, వివిధ రంగాల్లో సేవలందించిన వారిని సత్కరించడం వంటి కార్యక్రమాలను కూడా ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నారు.

**జూకల్ నుంచి..మరింత దూరం**

ఫొటోగ్రఫీ, చిత్రలేఖనంపై ఆసక్తి కలిగిన సునీల్ ప్రస్తుతం జూకల్‌లో వెడ్డింగ్ స్టూడియో నిర్వహిస్తూ తన వృత్తిని కొనసాగిస్తున్నారు. అదే సమయంలో రచయితగా, పాటల రచయితగా, సామాజిక సేవకుడిగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.
పల్లె మట్టి వాసనను పదాల్లోకి తీసుకొచ్చి.. తెలంగాణ సంస్కృతిని పాటల్లో పలికిస్తూ.. సమాజాన్ని చైతన్యపరిచే భావాలను అక్షరాల్లో ఆవిష్కరిస్తున్న మ్యాదరి సునీల్.. భూపాలపల్లి జిల్లా సాహితీ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటున్నారు.
కలం ఆయనకు కేవలం రచనా సాధనం కాదు.. సమాజాన్ని పలకరించే గొంతుక. పాట ఆయనకు కేవలం వినోదం కాదు.. చైతన్యానికి వేదిక. సాహిత్యం, సేవ రెండింటినీ తన ప్రయాణంగా మలుచుకున్న సునీల్ ప్రస్థానం మరిన్ని విజయాల వైపు సాగాలని సాహితీ అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

**-- మధుసూదన్ మామిడి**
**కరీంనగర్**

# వేర్వేరు దారుల్లో జీవితం..
# హరిబాబు కోసం ఒక్కటైన సహచరులు

**- ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపైకి..**
**- ఆపదలో ఉన్న కుటుంబానికి రూ.1.17 లక్షలకుపైగా చేయూత**

హనుమకొండ, సెప్టెంబర్ 3 హైదరాబాద్ ఎస్టేట్:
ఉద్యోగాలు మారాయి.. ప్రాంతాలు మారాయి.. ఎవరి జీవితాల్లో వారు స్థిరపడ్డారు. ఒకప్పుడు ఒకే సంస్థలో కలిసి పనిచేసిన సహచరులు కాలక్రమంలో దూరమయ్యారు. కానీ కామ హరిబాబు ఆకస్మిక మరణం వారందరినీ మళ్లీ ఒక్కచోట చేర్చింది. మిత్రుడి కుటుంబం ఆపదలో ఉందని తెలిసిన వెంటనే పాత అనుబంధాలను గుర్తుచేసుకుంటూ అండగా నిలిచారు. హరిబాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. దీనికితోడు సుమారు ఏడాది క్రితం జరిగిన ప్రమాదంలో ఆయన కుమారుడు రెండు కాళ్లు కోల్పోయి, ఇతరుల సహాయం అవసరమైన పరిస్థితిలో ఉన్నాడు. తండ్రిని కోల్పోయిన కుమారుడి పరిస్థితి, కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకున్న పాత సహచరులు స్పందించారు. హరిబాబుతో గతంలో కలిసి పనిచేసిన మిత్రులు ఒకరినొకరు సంప్రదించుకుని, వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వారిని ఒకే వాట్సాప్ వేదికపైకి తీసుకొచ్చారు. కుటుంబ పరిస్థితిని వివరించి సాయం చేయాలని కోరగా సుమారు 80 మంది స్పందించారు. తమ స్థోమతకు అనుగుణంగా విరాళాలు అందించడంతో మొత్తం రూ.1,17,805 సమకూరింది. ఆ మొత్తాన్ని హరిబాబు కుటుంబానికి అందించి తమ వంతు చేయూతనిచ్చారు. ఏళ్ల క్రితం కలిసి పనిచేసిన సహచరులు.. కాలంతో దూరమైనా కష్టసమయంలో మాత్రం ఒక్కటయ్యారు. ఓ మిత్రుడి కుటుంబానికి



అండగా నిలిచేందుకు స్పందించిన తీరు వారి అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది. హరిబాబును తిరిగి తీసుకురాలేకపోయినా.. ఆయన కుటుంబానికి 'మీకు మేమున్నాం' అనే భరోసా ఇవ్వగలిగారు. కష్టకాలంలో మనిషికి మనిషి అండగా నిలవాలనే మానవీయ సందేశాన్ని ఈ సహచరుల చేయూత చాటిచెప్పింది

## డయాఫ్రమ్ వాల్ కోల్పోవడం పెద్ద నష్టం: ఉండవల్లి అరుణ్‌కుమార్

, అమరావతి సెప్టెంబర్ 3.
జగన్ హయాంలోనే పోలవరం పనులు వేగంగా జరిగాయని అన్నారు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్. ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులు, కాల్వల పనులు వైఎస్సార్ హయాంలోనే జరిగాయని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ కోల్పోవడం అతిపెద్ద నష్టమని తెలిపారు. నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. ప్రాజెక్టులకు ఎవరెంత చేశారో ప్రజలకు బాగా తెలుసని ఉండవల్లి అన్నారు.

## పోలవరం భద్రతపై చంద్రబాబు సమాధానం చెప్పాలి: కన్నబాబు

పోలవరం, సెప్టెంబర్ 3.
పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, భద్రతను చంద్రబాబు ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి కన్నబాబు. ప్రాజెక్టు భద్రత, బాధితుల పరిహారంపై దృష్టి పెట్టాలని సూచించారు.



పబ్లిసిటీ తగ్గించి పనులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక పాలన

**- హామీలు అమలు చేయకుండా అన్నదాతలను మోసం చేస్తున్నారు**
**రైతు సదస్సులో మర్రి యాదవ రెడ్డి**

కాజీపేట, సెప్టెంబర్ 3 హైదరాబాద్ ఎస్టేట్:
రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను మోసం చేస్తోందని మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి ఆరోపించారు. దాస్యం వినయ్‌భాస్కర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు, రైతుల ఆధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో రైతు సదస్సు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా, రుణమాఫీ, పంటల కొనుగోళ్లు, మద్దతు ధరపై ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులను గుర్తించి నష్టానికి అనుగుణంగా తక్షణ పరిహారం అందించాలని కోరారు. రైతుల రుణభారం తగ్గించి వారికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం హామీల అమలులో జాప్యం చేయడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను అమలు చేసిందని గుర్తుచేశారు. రైతులను మాటలతో మభ్యపెట్టకుండా వారి సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారం చూపాలని అన్నారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. దాస్యం విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. అనంతరం కాజీపేట జంక్షన్‌లో బాకీ కార్డులు పంపిణీ చేశారు. సదస్సులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# 5న ఫీజు రియంబర్స్మెంట్,స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని భారీ ర్యాలీ

## BRS పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ భాస్కర్



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో మోసపోయిన విద్యార్థులు, యువత --- దీ=వాం ఢ దీ=వా యువజన ఆధ్వర్యంలో ఏకశిర పార్క్ నుండి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపిస్తూ దీ=వాం మరియు దీ=వా యువజన విభాగం దీ=వాం కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు బైరాపాక ప్రశాంత్ అధ్యక్షతన నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వినయ భాస్కర్ మాట్లాడుతూఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని నాయకులు విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి వంటి అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు, 2 లక్షల ఉద్యోగాల ఇస్తామన్న ఏమైందని ప్రశ్నించారు, ప్రతి విద్యార్థినికి ఉచిత స్కూటీ హామీ మరిచారన్నారు, విద్యార్థులకు నిరుద్యోగులకు మోసం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్ ను బొంద పెడతామని అన్నారు."1000 రోజుల కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు, యువతకు హామీలు కాదు... మోసాలే మిగిలాయి" అని పేర్కొంటూ ఆవిష్కరించిన పోస్టర్ ద్వారా ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.విద్యార్థులు, యువత సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని దీ=వాం మరియు దీ=వా యువజన విభాగం నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేసి విద్యార్థులు, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల మాజీ కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, మాజీ కార్పొరేటర్స్ దాస్యం విజయ భాస్కర్, జోరిక రమేష్, సోదా కిరణ్, నర్సింగ్,దీ=వాం కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు బైరపాక ప్రశాంత్,దీ=వాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, జిల్లా కోఆర్డినేటర్స్ లంక రాజగోపాల్, గంద్రకోట రాకేష్ యాదవ్,దీ=వాం నాయకులు కలకోట్ల సుమన్, కందికొండ తిరుపతి,రాసురి, స్నేహితు సిద్దు, ఇస్మాయిల్, భార్గవ్,
దీ=వా యువజన నాయకులు రామ్మూర్తి ,కేసోజు ప్రణయ్, మహమూద్, వినీల్ రావు, సృజన, సందీప్ , ఉదిత్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

## - తెలంగాణ ప్రజలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభినందనలు



హైదరాబాద్, సెప్టెంబర్ 3 హైదరాబాద్ ఎస్టేట్:
శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జన్మాష్టమి భక్తి, ధర్మం, ప్రేమ, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి ఉన్నత విలువలను గుర్తుచేసే పవిత్ర పర్వదినమని ఆయన పేర్కొన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ అవతరించిన పవిత్ర దినాన్ని దేశవ్యాప్తంగా జన్మాష్టమి, కృష్ణాష్టమిగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీకృష్ణుడిని పూజించి భగవద్గీత, శ్రీమద్భాగవతం పారాయణం చేస్తారని, సంప్రదాయబద్ధంగా ఉట్ల కొట్టడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారని వివరించారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించడం, పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పండుగ సందడి నెలకొంటుందని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి బోధనలు సమాజానికి ధర్మబద్ధమైన జీవనం, సత్యనిష్ఠ, కర్తవ్యపాలనకు మార్గదర్శకమని అన్నారు. ప్రజలంతా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి జన్మాష్టమిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎంపీ రవిచంద్ర ఆకాంక్షించారు.

# కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం.. సంక్షేమమే ఆయుధం

## - ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: -ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

## - 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా పరకాలలో భారీ ర్యాలీ



పరకాల, సెప్టెంబర్ 3 హైదరాబాద్ ఎస్టేట్:
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పరకాల పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ, డీసీసీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కుంకుమేశ్వర దేవస్థానం, వెల్లంపల్లి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, హుజూరాబాద్ రోడ్డు మీదుగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, కొత్త రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. పరకాలను విద్యా, అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, నైపుణ్యాభివృద్ధి కేంద్రం, టాస్క్ కేంద్రాల ఏర్పాటుతో పాటు పట్టణంలో మంచినీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. చారిత్రక పరకాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరుతో జరిగిన వ్యవహారాలను ప్రజలు మర్చిపోలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేసిన ఆయన.. అభివృద్ధి ముసుగులో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ నిధులతో రహదారులు నిర్మించి భూముల విలువ పెంచుకుని లబ్ధి పొందారన్న ఆరోపణలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు

# సీషెల్స్ పార్లమెంటరీ బృందంతో ఎంపీ రవిచంద్ర భేటీ

**- ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆహ్వానం మేరకు సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత**



హైదరాబాద్, సెప్టెంబర్ 3 హైదరాబాద్ ఎస్టేట్:
భారత్ పర్యటనలో ఉన్న సీషెల్స్ పార్లమెంటరీ ప్రతినిధి బృందంతో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర గురువారం భేటీ అయ్యారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీ.పీ. రాధాకృష్ణన్ ఆహ్వానం మేరకు ఆయన ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీషెల్స్ జాతీయ అసెంబ్లీ స్పీకర్ అజారెల్ ఎర్నెస్టా నేతృత్వంలోని పార్లమెంటరీ ప్రతినిధి బృందం భారత పర్యటనలో భాగంగా పార్లమెంటును సందర్శించి ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో సమావేశమైంది. భారత్, సీషెల్స్ మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు, పరస్పర సహకారంపై ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిపారు. సీషెల్స్ తూర్పు ఆఫ్రికా తీరానికి సమీపంలోని హిందూ మహాసముద్ర ద్వీప దేశం కాగా, భారత్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తోంది. ఇరు దేశాల మధ్య పార్లమెంటరీ సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే అంశాలకు ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. సీషెల్స్ ప్రతినిధుల గౌరవార్థం ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర పాల్గొని ప్రతినిధులతో ముచ్చటించారు.

# సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**

**"రంగారెడ్డి జిల్లా వైద్య అధికారి డాక్టర్ స్వర్ణకుమారి"**

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 3:-
రంగారెడ్డి జిల్లా: సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కొనసాగుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య, వైద్యుల సిబ్బంది హాజరు, రోగుల నమోదు వివరాలు, మందుల నిల్వలు, ప్రయోగశాల సేవలు, ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగాల్లో అందుతున్న సేవలను అధికారులు పరిశీలించారు. వివిధ వైద్య సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సిబ్బంది విధులకు సకాలంలో హాజరై బాధ్యతతో పనిచేయాలని, ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.
అదేవిధంగా ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులు



అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ కిరణ్మయి స్పష్టం చేశారు.

# కుటుంబ సభ్యుల మాటలకు మంత్రిపై వేటా?

## - కుటుంబ రాజకీయ అభిప్రాయాలకు కొండా సురేఖను బాధ్యురాలిని చేయడం ఏ న్యాయమన్న రడం భరత్‌కుమార్



గీసుగొండ, సెప్టెంబర్ 3 హైదరాబాద్ ఎస్టేట్:
కుటుంబ సభ్యుల వ్యక్తిగత రాజకీయ అభిప్రాయాలకు కొండా సురేఖను బాధ్యురాలిని చేసి మంత్రి పదవి నుంచి తొలగించడం దారుణమని జిల్లా నాయకులు రడం భరత్‌కుమార్ అన్నారు. గీసుగొండ మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయాలని, వాటితో తన తల్లికి సంబంధం లేదని ఆమె స్వయంగా స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కుటుంబ సభ్యులు భిన్న రాజకీయ అభిప్రాయాలు కలిగి ఉండటం సహజమని, ఒకే కుటుంబంలోని వారంతా ఒకే రాజకీయ పార్టీని అనుసరించాలనే నిబంధన లేదన్నారు. అభ్యంతరకర వ్యాఖ్యలు ఉంటే వాటిని చేసిన వ్యక్తినే ప్రశ్నించాలి తప్ప, కుటుంబ సంబంధాన్ని కారణంగా చూపి కొండా సురేఖపై చర్య తీసుకోవడం సమంజసం కాదన్నారు. కుమార్తె వ్యాఖ్యలకు తల్లిని బాధ్యురాలిని చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. బీసీ మహిళా నాయకురాలిగా రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన కొండా సురేఖపై తీసుకున్న చర్య బీసీ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందన్నారు. కుటుంబ సభ్యుల అభిప్రాయాలకు ప్రజాప్రతినిధులను బాధ్యులను చేసే పద్ధతి భవిష్యత్తులో వ్యక్తిగత స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిస్తుందని హెచ్చరించారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడానికి ఆమె చేసిన తప్పేమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిర్ణయాన్ని పునఃపరిశీలించి ఆమెను తిరిగి మంత్రి పదవిలో కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమం చేపడతామని కొండా సురేఖ అనుచరులు హెచ్చరించారు. సమావేశంలో మనుగొండ గ్రామ సర్పంచ్ పేర్ల శ్రావణ్, వంచనగిరి గ్రామ సర్పంచ్ కొమ్ముల కమల భిక్షపతి, సూర్య తండా సర్పంచ్ బానోతు రాఘవేంద్ర, సీనియర్ నాయకులు దర్శనాల రాజు, తాళ్లపల్లి అనిల్, కార్తీక్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ పేరుతో పేదల భూములు లాక్కుంటే సహించేది లేదు: ఈటల రాజేందర్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 3:-
తెలంగాణలో 22ఏ నిబంధనల పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు ఏళ్లుగా అనుభవిస్తున్న భూములపై హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. షామీర్‌పేట్‌లోని ఈటల రాజేందర్ నివాసంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో బీఎన్ రెడ్డినగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లో 118 ప్రభుత్వ ఉత్తర్వులకు సంబంధించిన భూముల సమస్యపై ఇరువురు చర్చించారు.
దశాబ్దాలుగా భూములను సాగు చేసుకుంటూ, నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ప్రజలకు అకస్మాత్తుగా ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేరిన భూముల అంశాన్ని పరిశీలించి, అర్హులైన ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని లచ్చి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై సంబంధిత అధికారులతో త్వరలోనే చర్చించి, సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈటల రాజేందర్ హామీ ఇచ్చినట్లు లచ్చి రెడ్డి తెలిపారు. పేదలు, రైతుల భూములకు రక్షణ కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.



# గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

## -“శాంతియుతంగా గణేష్ ఉత్సవాలు.. కలెక్టర్ ఆదేశాలు”

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 3:-
రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గణేష్ చవితి ఉత్సవాల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ డా. కె. కిరణ్మయితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 14న ప్రారంభమై 24న జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. శోభాయాత్ర మార్గాల్లో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, బారికేడ్లు, వేదికలు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉత్సవ మండపాలకు అవసరమైన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కనెక్షన్లను ముందుగానే తనిఖీ చేయాలని సూచించారు. మండపాల వద్ద పారిశుధ్యం, ఫాగింగ్, నిరంతర విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు వంటి ప్రమాదకర పరిస్థితులను తొలగించాలని, విగ్రహాలను తరలించే వాహనాలను ముందస్తుగా తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు, కంట్రోల్ రూమ్, వేగవంతమైన స్పందన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు,



పోలీసు శాఖ కలిసి ఉత్సవ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్, వైద్య, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ సమితుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మొయినాబాద్‌లో ఆక్రమణలపై ఉక్కుపాదం

మొయినాబాద్, సెప్టెంబర్ 3:
మొయినాబాద్ పట్టణంలో ట్రాఫిక్ రాకపోకలకు అడ్డంకిగా మారిన రహదారి ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌లు, ఇతర అవరోధాల తొలగింపునకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.
పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు వాహనాల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన తాత్కాలిక నిర్మాణాలు, వ్యాపార సామగ్రి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న ఇతర వస్తువులను తొలగించారు. రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన వాహనాలను కూడా అక్కడి నుంచి తరలించారు.
రహదారులను ఆక్రమించడం, వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంపై పోలీసులు సంబంధిత వ్యక్తులకు హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి 39(బి) కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.
మొయినాబాద్ పట్టణంలో వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చూడటంతో పాటు రహదారి భద్రతను పెంపొందించేందుకు ఇలాంటి తనిఖీలు, తొలగింపు చర్యలను నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. రహదారులను ఆక్రమించకుండా, వాహనాలను నిర్ణీత ప్రదేశాల్లోనే నిలిపి ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని వాహనదారులు, వ్యాపారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. సతీష్, మొయినాబాద్ ఎస్ఐ సత్యనారాయణతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలు, వాహనాలు, ఇతర అవరోధాలను తొలగించడంలో సిబ్బంది చర్యలు చేపట్టారు




# మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల ఉద్యోగులకు ఇక్కట్లు..

## -భారత్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద వాహనాల నిలిపివేతపై ఆగ్రహం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 3:-
రంగారెడ్డి జిల్లా (మహేశ్వరం) తాత్కాలికంగా మంగళపల్లిలో కిరాయి భవనం నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలను తాత్కాలికంగా భారత్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తుండగా, గత రెండేళ్లుగా ప్రభుత్వం భవనానికి అద్దె చెల్లిస్తున్నట్లు ఉద్యోగులు పేర్కొంటున్నారు. అయితే కళాశాల ప్రాంగణంలోకి ఉద్యోగుల వాహనాలను అనుమతించకుండా గేటు బయటే నిలిపివేయిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, వృద్ధులు, దివ్యాంగులు సైతం వాహనాలను బయటే ఉంచి



సుమారు రెండు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. కళాశాల చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి సూచనలతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అద్దె చెల్లిస్తున్న ప్రభుత్వ సంస్థకు చెందిన సిబ్బందిని ఇలా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి, ఉద్యోగుల వాహనాలకు తగిన పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

# సూర్యలంక బీచ్‌లో పచ్చదనం పెంపునకు శ్రీకారం

**తాటి విత్తనాలు నాటిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, నాగబాబు**

సూర్యలంక, బాపట్ల సెప్టెంబర్-03 :బాపట్ల, సెప్టెంబర్ 3: బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ పరిసర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యలంక బీచ్ పొగురు దిబ్బ వద్ద నిర్వహించిన తాటి విత్తనాల నాటే కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి., ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు) పాల్గొని తాటి విత్తనాలను నాటారు.
తీర ప్రాంతాల్లో సహజ వనరులను పరిరక్షించడం, పచ్చదనాన్ని విస్తరించడం, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. సూర్యలంక బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు తీర ప్రాంత జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు మొక్కలు, విత్తనాల నాటకం వంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు)



స్వయంగా తాటి విత్తనాలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి మద్దతు తెలిపారు. తీర ప్రాంతాల్లో పచ్చదనం పెంపు, పర్యావరణ సమతుల్యత పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.
ఈ సందర్భంగా లిఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి.లిలు తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, సూర్యలంక అభివృద్ధి, పచ్చదనం పెంపు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం మరోసారి గుర్తు చేసింది.
కార్యక్రమంలో ఆర్డీఓ ఏ. హరికుమార్, అటవీశాఖ



అధికారులు, కూటమి నాయకులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వెయ్యి రోజుల పాలనపై కాంగ్రెస్ శ్రేణుల సందడి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 3:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గురువారం సందడి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి వేడుకలు జరుపుకున్నారు.




ఆదిభట్ల సర్కిల్ పరిధిలోనూ కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిభట్లలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేసి నినాదాలు చేశారు. తుర్కయంజాల్ చెరువు కట్ట, అంబేడ్కర్ విగ్రహం వద్ద కూడా పార్టీ నాయకులు కార్యక్రమాలు నిర్వహించారు. మంచాల మండల కేంద్రంలోనూ కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు అందుబాటులో ఉండే పాలన కొనసాగుతోందన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రహదారులు, మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి నిధులు సమకూరుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషితో నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమాల్లో పలువురు నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# SIR మెగా విచారణలకు సిద్ధం

## “ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు”

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 3:-
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ా×=) ప్రక్రియలో భాగంగా ఓటర్లకు మరో ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు ఎన్నికల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి (శ్రీనివాస్ రెడ్డి) తెలిపారు. ఓటర్ల క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణతో పాటు గతంలో విచారణలకు హాజరుకాలేకపోయిన వారికి అవకాశం కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు, ా×= మెగా విచారణలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో, రెండో విడతలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ నాలుగు రోజుల్లో




ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ స్థాయి అధికారి (దీూ) అందుబాటులో ఉంటారు. అర్హులైన ఓటర్లు కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం-6, అభ్యంతరాల కోసం ఫారం-7, వివరాల మార్పులు లేదా సవరణల కోసం ఫారం-8ను దీూలకు సమర్పించవచ్చు. ఇదే సమయంలో ా×=కు సంబంధించిన పెండింగ్ విచారణలపై కూడా మెగా విచారణలు నిర్వహించనున్నారు. గతంలో నిర్ణయించిన తేదీల్లో విచారణకు హాజరుకాలేకపోయిన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని అవసరమైన ఆధారాలతో హాజరై తమ వివరాలను సమర్పించవచ్చు.
అర్హులైన పౌరులు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును నిర్ధారించుకోవాలని అధికారులు సూచించారు.

# 420 హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం..

## -యాచారంలో బీఆర్ఎస్ ధర్నా

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 3:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు యాచారం గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతులు, మహిళలతో కలిసి ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలకు ఇస్తామన్న ప్రయోజనాలు అందడం లేదని విమర్శించారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రకటించిన 420 హామీల అమలుపై ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించేందుకే ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ధర్నాలో మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు ముందుండి పోరాడాలని మంచిరెడ్డి కిషన్ రెడ్డిని రైతులు కోరారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని అన్నారు. గ్రామగ్రామాన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తామని, హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన ఉంటుందని తెలిపారు.



